పల్లె పండగ బిల్లుల చెల్లింపు ఎప్పుడో..!

- నెలలు గడుస్తున్నా అందని బిల్లులు
- వడ్డీలు కట్టలేక లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు


పల్లె పండగలో భాగంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న ఏఈ హరికృష్ణ (ఫైల్)

మెరకముడిదాం: పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చడంలో తెలుగుదేశం పార్టీది అందెవేసిన చేయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. అధికారం చేజిక్కించుకున్న తరువాత తమ మద్దతుదారులకు లబ్ధి చేకూరే విధంగా అభివృద్ధి పనులను కూటమి నాయకులకే అప్పగిస్తుండడమే దీనికి ఉదాహరణగా చెప్పువచ్చు. ఈ పనులను తమ మద్దతుదారులకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయితీల నిబంధనలకు పాతర వేస్తూ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు అధికారాలను కాలరాస్తూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి కొత్తగా వెండర్ విధానాన్ని తెరపైకి తీసుకువచ్చింది. తద్వారా ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ కార్యక్రమం కింద గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువలను నిర్మించి ఎంతోకొంత వెనకేసుకోవచ్చని, ఎలాగూ తమ పార్టీ అధికారంలో వుంది కనుక ఇలా పనులను పూర్తి చేస్తే అలా బిల్లులు తమ అక్కౌంట్లలో పడిపోతాయని కూటమి నేతలు భావించారు. అయితే ఇప్పుడు కూటమి నేతలు ఆశలన్నీ అడియాశలు అయిపోయాయి. ఎందుకంటే కూటమి నాయకులు చాలా గ్రామాల్లో రూ.లక్షల్లో అప్పులు వాడి మరీ మదుపులు పెట్టి ఈ పనులను చేపట్టారు. అయితే ఈ పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వీళ్లంతా లబోదిబోమంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశపడి వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేశామని, ఇంతవరకూ బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపాయి అప్పుల ఊబిలో చిక్కుకున్నామని వారు వాపోతున్నారు.

కూటమి నేతలకే పనుల కేటాయింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించారు. అందులో భాగంగానే పల్లె పండగ పేరుతో గత నవంబరులో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణ పనులను అప్పగించారు. మెరకముడిదాం మండలంలో మొదటి విడతలో 112 పనులకుగానూ రూ.975.28 లక్షలు ఉపాధి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంతవరకూ 88 పనులు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి రూ.335.50 లక్షల బిల్లులు చెల్లించాల్సి వుండగా కేవలం రూ.65.50 లక్షలు బిల్లులు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.270 లక్షలు చెల్లించాల్సి వుంది. బిల్లులు వెంటనే పడిపోతాయన్న ఆలోచనతో కూటమి నాయకులు చేపట్టిన పనులను ఆగమేఘాల మీద పూర్తి చేశారు. ఇప్పుడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కూటమి నాయకులు మింగలేక, కక్కలేకపోతున్నారు.

త్వరలోనే బిల్లుల చెల్లింపు

మండలంలో పల్లె పండగ పేరుతో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, కాలువలకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే ఆన్‌లైన్ చేశాం. నిధులు విడుదల కాగానే పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లిస్తాం.

– హరికృష్ణ, పీఆర్ ఏఈ, మెరకముడిదాం

రెండు పూటలా పని చేయాల్సిందే : ఏపీఓ


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కృష్ణవేణి

గజపతినగరం రూరల్: ఉపాధి కూలీలు రెండు పూటలా పని చేస్తేనే కనీస వేతనం రోజుకు రూ.300లకు పైగా అందుతుందని ఏపీఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని శ్రీరంగరాజపురం చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు పని సమయంలో కనీస వసతులైన టెంట్లు, తాగునీరు. ప్రథమ చికిత్స కిట్లను ఏర్పాటు చేసున్నామన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం ఆరు గంటలకే పని ప్రారంభించాలన్నారు. సాయంత్రం 3.30 ప్రాంతంలో రెండో పూట పనికి ఉపక్రమించాలని తెలిపారు. ఈ పర్యవేక్షణలో ఆమెతో పాటు టీఏలు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులపై ప్రజా వేదిక


వాటర్ షెడ్ పథకం ద్వారా జరిగిన పనులను చదివి వినిపిస్తున్న రీసోర్స్‌పర్సన్

దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో 2022 – 23 సంవత్సరంలో జరిగిన వాటర్ షెడ్ పథకం ద్వారా జరిగిన పనులకు డ్వామా పీడీ శారదాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌లు పథకం ఆధ్వర్యంలో మెరకముడిదాం, మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో వ్యవసాయ పనిముట్లు, నీటి వనరులు, తదితర కార్యక్రమాలకు రూ.196 లక్షలతో జరిగిన పనులను చదివి వినిపించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల నిర్వహణ బాగోలేదని, రైతులకు అందజేసిన, టార్పాలిన్లు, మోటార్ల వినియోగంపై నిర్వహించాల్సిన కమిటీ సమావేశాలు జరగలేదన్నారు. చెక్‌డామ్‌లు, నీటి నిల్వల కోసం రైతులకు సరైన అవగాహన కల్పించలేదని రిసోర్స్‌పర్సన్‌లు చదిని వినిపించారు. కార్యక్రమంలో ఏపీడీ రమామణి, దత్తిరాజేరు ఉపాధి హామీ ఈసీ శ్రీకాంత్, మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు చెబుతున్న పెంటంనాయుడు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత కొత్తగా నియమించిన పార్టీ అనుబంధ రంగాలకు చెందిన నాయకులపై ఉందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులుగా నియమితులైన సాలాపు పెంటంనాయుడు ఆయనను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలుసుకుంటూ గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీవీ ప్రభూజీ, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకగా నందీశ్వరస్వామి తీర్థం

లక్కవరపుకోట : మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో గల నందీశ్వరస్వామి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ తీర్థ మహోత్సవం నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా నందీశ్వరుడుకి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మొక్కలు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నందీశ్వరుడుని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం పేదల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పేదలు

శృంగవరపుకోట: పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం చేయాలని సీపీఐ నేతలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. పట్టణ పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని కోరారు. అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని నినదించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఖండిపల్లి భీములు, పురం అప్పారావు, శ్రీను, రామకృష్ణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ గేటు ధర్నా


ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ కార్మికులు, నాయకులు

శృంగవరపుకోట : ఆర్టీసీ డిపోల్లోని సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గేటు ధర్నా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డిపో అధ్యక్ష కార్యదర్శులు జీవీ రమణ, ఎ.రాజయ్య మాట్లాడుతూ 2019 జనవరి నాటి సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 114 జీఓ ప్రకారం నైట్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. ధర్నాలో ఆ సంఘం జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జీఎస్ రాజు, జిల్లా చైర్మన్ సీహెచ్‌వీఎస్‌ఆర్ మూర్తి, జిల్లా కమిటీ సభ్యులు కె.ఆనంద్, కార్మికులు పాల్గొన్నారు.

21న ప్రవేశ పరీక్ష

దత్తిరాజేరు : షికారుగంజి వద్దనున్న మోడల్ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రోజు మోడల్ పాఠశాలలో ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు జరగనున్న పరీక్షకు హాజరు కావాలని సూచించారు. హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

13న గురుకులంలో..

చీపురుపల్లి రూరల్: పట్టణంలోని డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఈ నెల 13న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రాణిశ్రీ తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రానికి గంట ముందు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...


అలరించిన విద్యార్థినుల నృత్యాలు

చీపురుపల్లి రూరల్: పట్టణంలోని శ్రీ వెంకటరమణ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థులు శుక్రవారం సందడి చేశారు. విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రిన్సిపాల్ ఎం.ఆదినారాయణ, కరస్పాండెంట్ ఎస్.వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు పూటలా పనులు చేయాలి

మెరకముడిదాం : ఉపాధి పనులకు హాజరయ్యే వేతనదారులు వేసవి కావడంతో ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులను చేయాలని ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు వేతనదారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కోర్లం, బుధరాయవలస గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. వేతనదారులకు చెందిన మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఎవరి జాబ్ కార్డుపై వాళ్లే పనులకు హాజరు కావాలన్నారు. పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

రహదారి కోసం ఎమ్మెల్సీకి వినతి


ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావులకు వినతిపత్రం అందజేస్తున్న పెదఖండేపల్లి యువకులు

శృంగవరపుకోట: తమ కళ్లాలకు వెళ్లేందుకు నాలుగు దశాబ్దాలుగా సరైన మార్గం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని తిమిడి రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావును కలిసి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ రఘురాజుతో మాట్లాడుతూ తమ కళ్లాలకు మార్గం లేకుండా అవస్థలు పడుతున్నామని, వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ఏదో ఒక గ్రాంటు నుంచి నిధులు కేటాయింపు చేయించి రోడ్డు నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. పెదఖండేపల్లి గ్రామానికి చెందిన యువకులు ఒబ్బిన సతీష్, గోవింద్, పిల్లా నాగరాజు, కూనిశెట్టి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిగత రక్షణపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

గజపతినగరం : అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తమను తాము కాపాడుకోవడానికి కరాటేతో పాటు పలు రకాల విద్యలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆయన విద్యార్థినులకు పలు రకాల సెల్ఫ్ డిఫెన్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. హెచ్ఎం చిప్పాడ రమేష్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

లక్కవరపుకోట : మండలంలోని రంగాపురం – జమ్మాదేవిపేట గ్రామాల మధ్య నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పీఆర్ జేఈ వీరలక్ష్మి మాట్లాడుతూ ఈ రోడ్డును ఉపాధి నిధులు రూ.20లక్షలతో నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. గ్రామ పెద్దలతో పాటూ మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష రేపు

కొత్తవలస : మండలంలోని వియ్యంపేట గ్రామం సమీపంలో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సంబంధిత విద్యార్థులు హాల్ టిక్కెట్‌లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్యంపై అవగాహన


వ్యక్తిగత పరిశుభ్రతతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

లక్కవరపుకోట : వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం అని మండల వైద్యాధికారి బి.సునీల్ కుమార్ అన్నారు. మండలం కేంద్రంలోని లక్కవరపుకోట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శిశువు, బాలింతలు, గర్భిణులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువుల్లో ఇన్‌ఫెక్షన్లు నివారించడానికి చేతులను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణులు పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గుమ్మా నర్సింహమూర్తి, సంతోష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలతో అలంకరించి, పంచామృతాభిషేకాలతో పాటు కుంకుమ పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

వెయ్యి రోజుల సంరక్షణతో బిడ్డకు ఆరోగ్యం


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

మెరకముడిదాం: వెయ్యి రోజుల సంరక్షణతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు నిండు నూరేళ్ల జీవితాన్ని ఇచ్చిన వాళ్లమవుతామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తాడ్డి శ్రీదేవి అన్నారు. మండలంలోని గర్భాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామానికి చెందిన నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల ఆధ్వర్యంలో సంయుక్త పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ వెయ్యి రోజులు తల్లీబిడ్డల సంరక్షణ కోసం గర్భిణులు, బాలింతలను ఓటీఆర్ ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి జ్యోతిరావుపూలే ఆదర్శం


చీపురుపల్లి రూరల్: లావేరు రోడ్డులో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ సుధారాణి తదితరులు


లక్కవరపుకోట : జమ్మాదేవిపేటలో జ్యోతిరావుపూలే ఏపీ రెసిడెన్షియల్ బాలికల ఆశ్రమ పాఠశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది


శృంగవరపుకోట: ఆర్టీసీ డిపోలో జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నేటి తరానికి మహాత్మ జ్యోతిరావుపూలే ఆదర్శం కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సంఘ సంస్కర్తగా, ఆదర్శప్రాయుడుగా జీవించిన పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నిమ్నజాతుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఆడ దూడల ప్రదర్శన



లక్కవరపుకోట మండలం లింగాపేట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆడ పెయ్యిల ప్రదర్శన శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామానికి చెందిన 48 మంది పాడి రైతులకు సంబంధించి 50 పెయ్యిలను ప్రదర్శించారు. ఆరోగ్యకరంగా ఉన్న మూడు పెయ్యిలను ఎంపిక చేసి సంబంధిత యజమానులకు బహుమతులను అందజేశారు. పశు వైద్యాధికారులు గాయిత్రి, సత్యనారాయణ, తులసి, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

– లక్కవరపుకోట

వైభవంగా రామాలయ ప్రతిష్ఠ మహోత్సవం



కొత్తవలస మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా వేదపండితులు అంపోల ఉమామహేశ్వరశర్మ తన బృంద సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆదివారం ప్రధాన ఘట్టమైన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం, భారీ అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గ్రామస్తులంతా ఒక్కటై సుమారు కోటి రూపాయలకు పైగా చందాలను పోగుచేసి నూతన ఆలయాన్ని నిర్మించారు.

– కొత్తవలస

అభివృద్ధి పనులకు భూమి పూజ

శృంగవరపుకోట : మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం భూమి పూజ చేశారు. పోతనాపల్లిలో కూనిరెడ్డి వారి కళ్లాల వద్ద రూ.10లక్షల సీసీ రోడ్డు, సంతగవిరమ్మపేటలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, కుమ్మరిపేటలో రూ.5లక్షలతో సీసీ డ్రైన్, ఎస్.కోట పట్టణంలో ముంతాజ్ హోటల్ వద్ద రూ.10లక్షలతో డ్రైనేజి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


రెడ్డిపేట సమీపంలోని సన్నిధానంలో ప్రత్యేక పూజల్లో భక్తులు, ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి రూరల్: అయ్యప్పస్వామి పుట్టిన రోజు పురస్కరించుకుని శుక్రవారం స్వామి సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ అన్నసమారాధన నిర్వహించారు. చీపురుపల్లి మండలంలోని పుర్రేయవలస సన్నిధానం, రెడ్డిపేట సమీప సన్నిధానం, గరివిడి అయ్యప్పస్వామి సన్నిధానంలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని ఊరేగించారు. అన్న సమారాధన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం రూరల్: నిరభ్యంతరకరమైన ప్రభుత్వ భూమిపై నివాస యూనిట్లు ద్వారా అనధికార ఆక్రమణలను క్రమబద్ధీకరించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని తహసీల్దార్ రత్నకుమార్ శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని అక్టోబర్ 15, 2019నాటికి ఆక్రమణ స్థలంలో నివాసం ఉన్నవారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ ఏడాది జనవరి నెలాఖరులో జీఓ నంబరు 30ని ప్రభుత్వం జారీ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం నివాస యూనిట్లు ద్వారా ఆక్రమణలు క్రమబద్ధీకరించడానికి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గడువు ఇచ్చిందన్నారు. క్రమబద్ధీకరణకు అర్హులైన వారు అధిక శాతం పురిటిపెంట, గజపతినగరం పంచాయతీలలో ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇప్పటి వరకూ క్రమబద్ధీకరణ చేసుకునేందుకు మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. వీలైనంత తొందరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కిసాన్ సభ ఆవిష్కరణ దినోత్సవం


ఎస్.కోట రైతుబజార్ వద్ద కిసాన్ సభ ఆవిష్కరణ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు, రైతులు

శృంగవరపుకోట: అఖిల భారత కిసాన్ సభ ఆవిష్కరణ దినోత్సవం శుక్రవారం స్థానిక రైతుబజార్ ప్రాంగణంలో సీపీఎం అనుబంధ జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి మద్దిల రమణ నేతృత్వంలో గొంప కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ ముందుగా కిసాన్ సభ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై 1936 సెప్టెంబర్ 11న లక్నోలో అఖిల భారత కిసాన్ సభ నిర్వహించారన్నారు. భూసంస్కరణల చట్టం, కౌలుదారీ చట్టం, గిట్టుబాటు ధరలు, ప్రాజెక్టుల సాధనలో కిసాన్ సభ పాత్ర కీలకం అన్నారు. మోడీ పాలనలో కల్తీలు, రైతుల అప్పులు, ఆత్మహత్యలు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రైతులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్న లక్ష్యంతో ఆవిర్భావ దినోత్సవం చేస్తున్నామన్నారు. రైతాంగ ఉద్యమాలతోనే రైతు రాజ్యం సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో సి.హెచ్.ముత్యాలు, కె.సూర్యం, లక్ష్మి, బుచ్చిరాజు, వి.కృష్ణ, ఎస్.సూరి తదితరులు పాల్గొన్నారు.